

ప్రచారానికి గిరాకీ

పోలింగ్ సమయం సమీపిస్తున్న కొద్దీ జిల్లాలో ప్రచారం జోరందుకుంటోంది. తక్కువ సమయమే ఉండడంతో ప్రత్యర్థుల ఎదుట బల ప్రదర్శనకు ఖర్చుకు వెనుకాడడం లేదు. 10లో▸



తనిఖీలు ముమ్మరం

జిల్లాలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. నగదు, మద్యం, బహుమతుల రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో తనిఖీలు చేస్తున్నారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
32.0 /20.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉత్తరం దిశగా చలిగాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేడు జన్నారానికి కేటీఆర్ రాక



సభాస్థలి వద్ద జాన్సన్‌నాయక్, రవీందర్‌రావు

జన్నారం: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ శుక్రవారం జన్నారానికి రానున్నారు. ప్రజాఆశీర్వాద సభలో పాల్గొంటారని ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్, మాజీ ఏపీపీఎస్సీ సభ్యుడు రవీందర్‌రావు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని గాంధీనగర్ సమీపంలో బహిరంగ సభాస్థలిని వారు పరిశీలించారు. సభ ప్రాంగాణం, వేదిక, కార్యకర్తలు, ప్రజలు కూర్చుండే స్థలం, పార్కింగ్, హెలిప్యాడ్ తదితర వాటిని సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు జన్నారానికి వస్తారని, రేండ్లగూడ సమీపంలో హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గంలో బహిరంగ సభ ప్రాంతానికి చేరుకుంటారని తెలిపారు. 50వేల మందిని తరలించడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

నేడు మంత్రి కేటీఆర్ రోడ్‌షో

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలో శుక్రవారం ఉదయం 11:30 గంటల నుంచి మంత్రి కేటీఆర్ రోడ్‌షో నిర్వహించనున్నారని బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు తెలిపారు. నస్పూర్‌లోని కలెక్టర్ కార్యాలయం హెలిప్యాడ్ నుంచి మంచిర్యాల ఫ్లై ఓవర్ బ్రిడ్జి, శ్రీనివాస టాకీస్, ముఖరం చౌరస్తా, అర్చనటెక్స్ చౌరస్తా, పోలీస్‌స్టేషన్ మీదుగా బెల్లంపల్లి చౌరస్తా వరకు రోడ్‌షో ఉంటుందని పేర్కొన్నారు.

బెల్లంపల్లిలో రద్దు

బెల్లంపల్లి: మంత్రి కేటీఆర్ బెల్లంపల్లి రోడ్‌షో రద్దయినట్లు పార్టీ శ్రేణులు తెలిపారు. శుక్రవారం బెల్లంపల్లిలో రోడ్ నిర్వహిస్తారని ముందుగా ప్రచారం చేశారు. ఎమ్మెల్యే చిన్నయ్య అస్వస్థతకు గురికావడంతో రోడ్‌షో రద్దు చేసుకున్నట్లుగా తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుల ఆమోదం

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గంలో 179 మంది పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు ఫారాలు అందజేయగా ఇందులో 167 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగానికి ఆమోదించినట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి సిడాం దత్తు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే వారి వివరాలను వెల్లడించారు. నియోజకవర్గంలో 98 సీనియర్ సిటిజన్లు, 54 మంది ఉద్యోగులు, 15 మంది దివ్యాంగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోనున్నారని పేర్కొన్నారు.

స్ట్రాంగ్ రూముల పరిశీలన



స్ట్రాంగ్ రూం వద్ద అధికారులతో పరిశీలకులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూంలను నియోజకవర్గ పరిశీలకులు సజ్జన్ ఆర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూంల వద్ద భద్రత కట్టుదిట్టంగా ఉంచాలని, అధికారులు పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు. ఆర్‌వో సిడాం దత్తు, తహసీల్దార్ మల్లిఖార్జున్, సీఐ వాసుదేవరావు పాల్గొన్నారు.

ఓటు హక్కు భవిష్యత్‌కు మార్పు



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

మంచిర్యాలక్రైం: ఓటు హక్కు దేశ భవిష్యత్‌ను మార్చి వేస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.చక్రపాణి అన్నారు. గురువారం స్థానిక డిగ్రీ కళాశాలలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై యువ ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ సమాన హక్కు ఉండాలని అంబేద్కర్ ఓటు హక్కు కల్పించారని, ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా సరైన నాయకున్ని ఎన్నుకునే హక్కు కలిగిందని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అందరూ వినియోగించుకోవాలని అన్నారు. అనంతరం కళాబృందం ఆటపాటతో ఓటు విలువను తెలియజేశారు. ఎస్‌వీఈపీ టీమ్ సూపర్‌వైజర్ రాంచందర్, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌చార్జి కనకలక్ష్మి, సంతోష్, కిషోర్‌కుమార్, ప్రేమలత, అధ్యాపకులు, కళాజాత బృందం రమేష్, మురళి, రవీందర్, నిరోష, నాగలక్ష్మి, సమీరా, సంధ్య పాల్గొన్నారు.

నోట్ల కట్టలపైనే నిఘా!

- చెన్నూరు నియోజకవర్గంలో డబ్బు చుట్టే రాజకీయం
- మాజీ ఎంపీ వివేక్ లావాదేవీలపై సుమన్ ఫిర్యాదు
- తాజాగా 'ఉప్పల్‌లో రూ.50లక్షల' కేసుపైనా దుమారం
- ఎన్నికల్లో తారాస్థాయికి అభ్యర్థుల ఆరోపణలు



హైదరాబాద్ నగర పరిధి ఉప్పల్‌లో పట్టుబడిన నగదు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: చెన్నూర్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల రాజకీయం డబ్బు చుట్టే నడుస్తోంది. మాజీ ఎంపీ, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్ ఆర్థిక లావాదేవీలపై బీఆర్‌ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఫిర్యాదులు చేయడం తెలిసిందే. ఓ ఖాతాకు రూ.8కోట్లు అనుమానాస్పదంగా వచ్చాయని, ఎన్నికల సంఘం, ఎన్‌ఫోర్స్‌డైరెక్టరేట్(ఈడీ), ఆదాయ పన్నుశాఖకు సుమన్ ఫిర్యాదు చేశారు. తాజాగా ఈ నెల 15న హైదరాబాద్ నగరం ఉప్పల్ పోలీసుస్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యక్తులు రామంతపూర్ వైపు రూ.50లక్షలు డబ్బులు తరలిస్తుండగా మల్కాజిగిరి ఎస్‌వోటీ పోలీసులకు పట్టుబడ్డారు. ఈ డబ్బులు కూడా వివేక్‌కు చెందిన కంపెనీ ఉద్యోగులే చెన్నూరు నియోజకవర్గానికే తరలిస్తుండగా పట్టుబడ్డాయని సుమన్ వర్గం నియోజకవర్గంలో ప్రచారం చేస్తోంది. ఈ వ్యవహారంపై ఇప్పటికే ఉప్పల్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు కాగా, దర్యాప్తు జరుగుతోంది. హైదరాబాద్‌లో డబ్బులు పట్టుబడిన వ్యవహారం చెన్నూరు నియోజకవర్గంలో ఎన్నికల వేళ సుమన్ వర్గానికి రాజకీయంగా ప్రచార అస్త్రంగా మారింది. ఇప్పటికే 'గడ్డం బ్రదర్స్' బెల్లంపల్లి, చెన్నూరు నియోజకవర్గాల్లో కార్యకర్తలు, నాయకులను ప్యాకేజీలతో కొంటున్నారని బెల్లంపల్లి సభలో సీఎం కేసీఆర్‌తోపాటు స్థానిక నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో ఈ డబ్బుల ఘటనలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి.

అంతా పైసలపైనే ఆరోపణలు

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థుల మధ్య డబ్బుల చుట్టే నిత్యం ఆరోపణలు సాగుతున్నాయి. ఈసారి ఎన్నికల్లో ఇదే ప్రధాన ప్రచారాస్త్రంగా మారింది. ఎమ్మెల్యే బాల్క సుమన్ ఇసుకపై రూ.కోట్లు సంపాదించారని వివేక్ ఆరోపిస్తుంటే, ప్రతిగా సుమన్ తమ నాయకులను అంగ్రాస్ పాటలో లాగా కొనుగోలు చేస్తున్నారని ధ్వజమెత్తుతున్నారు. నియోజకవర్గంలో నువ్వంటే నువ్వు డబ్బులు పంచుతున్నావని ఆరోపించుకోవడంతో ఇద్దరి మధ్య ఆరోపణలపై ప్రత్యారోపణలు సాగుతున్నాయి. గతంలో ఇదే తీరుగా సాగింది. 2014 ఎంపీ ఎన్నికల సందర్భంగా పెద్దపల్లి నుంచి పోటీ చేసిన ఈ ఇద్దరు నాయకులే కాంగ్రెస్, టీఆర్‌ఎస్ ప్రత్యర్థులుగా ఎన్నికల్లో తలపడ్డారు. అప్పట్లో సుమన్ తనపై ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ కేసులు ఉన్నాయని, వివేక్ వద్ద రూ.కోట్లు ఉన్నాయని ప్రచారం చేశారు. తాజాగా ఇప్పుడు సుమన్ వద్ద రూ.కోట్లు ఉన్నాయని అవి ఎలా వచ్చాయని నాటి ప్రచారాన్ని వివేక్ ముందుకు తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో పోలింగ్ సమయం దగ్గర పడుతున్న కొద్దీ రోజురోజుకు ఇద్దరు నాయకుల మధ్య ఆరోపణలు, విమర్శలు తారాస్థాయికి చేరుతున్నాయి.

'ప్యాకేజీలతో కాదు ఫ్రస్టేషన్‌లో చేరుతున్నారు'



మాజీ ఎంపీ వివేక్

బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో ప్యాకేజీలతో కాదు, ఫ్రస్టేషన్‌లో చేరుతున్నారని మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి అన్నారు. గురువారం మంచిర్యాలలో ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. కార్యకర్తలు, నాయకులు కలిసేందుకు కూడా సమయం ఇవ్వకనే సుమన్‌పై విరక్తి చెంది ఫ్రస్టేషన్‌లో పార్టీ మారుతున్నారని తెలిపారు. హుజూరాబాద్ ఉప ఎన్నికలో సొంత పార్టీ నాయకులనే రేట్లు కట్టి సుమన్ కొనుగోలు చేశారని ఆరోపించారు. ఇప్పుడు ప్యాకేజీలతో చెన్నూరు ఎమ్మెల్యే ఆశావహులను కొంటున్నారని పేర్కొన్నారు. తన డబ్బంతా లీగల్‌గా సంపాదించిందని, ఆర్థిక లావాదేవీలపై ఎవరైనా దర్యాప్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇసుకపై సంపాదిస్తున్న సుమన్ ఎంత ఆదాయపన్ను కట్టారో చెప్పాలని, తాను ప్రతీ ఏడాది రూ.వందల కోట్లు పన్ను చెల్లిస్తానని చెప్పారు. సుమన్ చేసిందేమీ లేదని, ఎంపీ, ఎమ్మెల్యేగా పనిచేసి కూడా ఆర్కేపీ ఆర్వోబీ పూర్తి చేయలేకపోయారని అన్నారు. తాము పదవీలో ఉండగా ఎంతో చేశామని, కార్యకర్తల ఒత్తిడి మేరకే ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానని, ఇక జీవితమంతా ప్రజాసేవకే అన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, గెలుపు ఖాయమని తెలిపారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న బిశ్వజిత్ దత్తా

బెల్లంపల్లి: ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు నిబంధనలు పాటించాలని కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకుడు బిశ్వజిత్ దత్తా, పోలీసు శాఖ పరిశీలకుడు ఆర్.ఇలాంగో తెలిపారు. గురువారం బెల్లంపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్వో) రాహుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతీ అభ్యర్థి ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని తెలిపారు. ఎన్నికల్లో రాగద్వేషాలకు అతీతంగా వ్యవహరించాలని, పోటీదారుల మనోభావాలు దెబ్బతినకుండా చూడాలని అన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాల్సిన బాధ్యత అభ్యర్థులదేనని అన్నారు. తగాదాలకు ఆస్కారం లేకుండా ప్రచారం చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు నిర్వహిస్తున్న ప్రచారంపై నిఘా ఉంటుందని అన్నారు. ఎన్నికల ప్రచారంలో అనుసరించాల్సిన విధానాలను వివరించారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు దుర్గం చిన్నయ్య, గడ్డం వినోద్, ఇతర అభ్యర్థులు, ప్రతిపాదకులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

కరెంట్ కాంగ్రెస్.. కావాల్నా?



బహిరంగ సభకు హాజరైన జనం

- తేల్చుకోవాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్
- ఆదిలాబాద్, ఇచ్చోడ ప్రజాఆశీర్వాద సభల్లో సభికులకు ప్రశ్నలు
- ఉత్సాహంగా సమాధానాలిచ్చిన జనం
- రెండు సభలకు భారీగా జన సమీకరణ
- సభలు సక్సెస్.. గులాబీ పార్టీలో జోష్



బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

సాక్షి, ఆదిలాబాద్/ఆదిలాబాద్‌టౌన్/ఇచ్చోడ: 'కరెంట్ కావాల్నా.. కాంగ్రెస్ కావాల్నా.., రైతుబంధు కావాల్నా.. రాబందా?..' అంటూ సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభల్లో సభికులను ప్రశ్నించారు. దీంతో కరెంట్ కావాలని... రైతుబంధు ఉండాలని జనం ఉత్సాహంగా బదులిచ్చారు. సంక్షేమ పథకాలుండాలంటే ఆదిలాబాద్, బోథ్ బీఆర్‌ఎస్ అభ్యర్థులు జోగు రామన్న, అనిల్‌జాదవ్‌ను గెలిపించాలని సీఎం కేసీఆర్ కోరారు. వీరిని గెలిపిస్తేనే బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని, తద్వారా అభివృద్ధి కొనసాగుతుందని చెప్పారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే వ్యవసాయానికి 24 గంటల కరెంట్ రాదని, రైతుబంధు రద్దు చేస్తారని విమర్శించారు. గురువారం ఆదిలాబాద్, ఇచ్చోడలో నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభలకు ఆయన హాజరై ప్రసంగించారు. ఆదిలాబాద్ చరిత్రలో ఒకే ఒక్కడు జోగు రామన్న తన మాట నిలబెట్టుకుని కోరటా–చనాకా బ్యారేజీ చేయిస్తున్నాడని, పనులు పూర్తి కావచ్చాయని తెలిపారు. అలాగే బోథ్ నియోజకవర్గ అభ్యర్థి అనిల్‌జాదవ్ విజ్ఞప్తి మేరకు కుప్టి రిజర్వాయర్ ప్రారంభించి పూర్తి చేసే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. అనిల్‌జాదవ్‌ను గెలిపిస్తే బోథ్ రెవెన్యూ డివిజన్‌ను నెలరోజుల్లోనే ఏర్పాటు చేస్తానని చెప్పారు. డిగ్రీ కళాశాల మంజూరు చేస్తామని తెలిపారు. ఇక్కడ టమాట సాగు చేస్తున్నందున కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. కోరటా–చనాకా కాలువతో 51వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. దీనిని పిప్పల్‌కోటి రిజర్వాయర్‌కు కూడా లింక్ చేసుకుంటే బ్రహ్మాండమైన అభివృద్ధి సాధ్యమని తెలిపారు. జోగు రామన్న, అనిల్‌జాదవ్ సామాన్య, ఉత్తమ వ్యక్తులని, ప్రజల్లో కలిసి ఉండేవారని కితాబిచ్చారు.

ఉత్సాహం నింపిన సభలు

జిల్లాలో సీఎం కేసీఆర్ సభలు సక్సెస్ కావడంతో గులాబీ శ్రేణుల్లో ఆనందోత్సాహం కనిపిస్తోంది. ఆదిలాబాద్, ఇచ్చోడలో నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభలకు భారీగా జనసమీకరణ చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డైట్ మైదానం, బోథ్ నియోజకవర్గ పరిధిలోని ఇచ్చోడలోగల బైపాస్ రోడ్డు వద్ద మైదానంలో గురువారం భారీ బహిరంగ సభలు నిర్వహించారు. మొదట ఆదిలాబాద్‌కు మధ్యాహ్నం 2.15 గంటల సమయంలో కేసీఆర్ హెలీక్యాప్టర్‌లో చేరుకున్నారు. సీఎం రాక ఆలస్యమైనప్పటికీ జనాలు ఉత్సాహంగా ఎదురుచూడటం కనిపించింది. తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వేణుగోపాలాచారి, మాజీ శాసనసభాపతి మధుసూదనాచారి ఆయన వెంట వచ్చారు. ఎమ్మెల్సీ దండే విఠల్, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, రైతుబంధు సమితి అధ్యక్షుడు రోకండ్ల రమేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఆ తర్వాత ఇచ్చోడ సభకు సీఎం చేరుకున్నారు. అక్కడ ఆదిలాబాద్ సభలో పాల్గొన్న నేతలతో పాటు మాజీ ఎంపీ గోడం నగేశ్, ఇచ్చోడ, బోథ్ ఎంపీపీలు ప్రీతంరెడ్డి, తుల శ్రీనివాస్, తాంసి జెడ్పీటీసీ సభ్యుడు రాజు, మండల కన్వీనర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చెన్నూరుకు 'ఓయూ' లీడర్లు

- బీఆర్‌ఎస్ అభ్యర్థి బాల్క సుమన్‌కు వ్యతిరేకంగా ప్రచారం
- ఆయన ఓటమే లక్ష్యంగా పని చేసేందుకు రాక
- నియోజకవర్గంలో మొదలైన పోలీసు నిఘా

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ నాయకులు అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని చెన్నూర్‌లో ప్రారంభించడం కలకలం రేపుతోంది. స్థానిక ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ ఓటమే లక్ష్యంగా పని చేసేందుకు రంగంలోకి దిగడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. విద్యార్థి నాయకుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి ఎంపీ, ఎమ్మెల్యేగా సుమన్ ఎన్నికైనప్పటి నుంచి నేటి వరకు ఓయూ విద్యార్థులకు గానీ ఇటు రాష్ట్ర విద్యారంగానికి ఏమీ చేయలేదనే కారణంతోనే ఆయనను మళ్లీ గెలిపించొద్దనే నినాదంతో ప్రచారం చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ మేరకు ఓయూ జేఏసీ నాయకులు, కాంట్రాక్టు ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర విద్యారంగ ప్రముఖులు చెన్నూరు నియోజకవర్గానికి దాదాపు 400మందికి పైగా వచ్చినట్లుగా చెబుతున్నారు. గురువారం నుంచే ఈ మేరకు ప్రచారం చేపట్టారు. నియోజకవర్గంలో ప్రతీ గ్రామంలోని ఇంటింటికి తిరిగి బాల్క సుమన్‌కు వ్యతిరేకంగా పని చేస్తామని చెబుతున్నారు. మొదటి రోజు పలు చోట్ల ప్రచారం ప్రారంభించారని నాయకులు తెలిపారు. ఈ నెల 28వరకు ఇక్కడే ఉండి ప్రచారం చేయనున్నట్లు తెలిపారు.

పోలీసుల ఆరా...

చెన్నూరులో ఓయూ విద్యార్థి నాయకులు ప్రచారం చేస్తున్నారని తెలుసుకున్న స్థానిక పోలీసులు ఆరా తీస్తున్నారు. వీరంతా ఎక్కడి నుంచి వచ్చారు? ఎవరెవరు ఉన్నారు? ఎక్కడ ఉంటున్నారు? వీరి వెనక ఎవరెరు ఉన్నారనే తదితర వివరాలు సేకరిస్తున్నారు. ప్రచారం చేస్తున్న విద్యార్థి జేఏసీ నాయకుల ఆధార్, ఓటరు, గుర్తింపు కార్డులు చూపించాలని అడిగారు. ఇదే తీరుగా తమను పోలీసులు ఇబ్బందులు పెడితే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని చెప్పుకొచ్చారు.

సుమన్ ఓటమే లక్ష్యం

బాల్క సుమన్‌పై మాకెవరికీ వ్యక్తిగతంగా కోపం లేదు. ఓయూ విద్యార్థులమైనా మేం తెలంగాణ రాష్ట్రంలో దగాపడ్డాం. విద్యార్థి, నిరుద్యోగుల ఆత్మహత్యలు, రాష్ట్రం కోసం పోరాటం చేసిన విద్యార్థుల కోసం పదవిలో ఉండి కూడా ఏనాడు పట్టించుకోలేదు. ప్రైవేటు యూనివర్సిటీలు తీసుకొచ్చారు. ఓయూ వీసీగా తమ అనుకూల వారినే తెచ్చుకున్నారు. ప్రశ్నపత్రాల లీకేజీలు, గ్రూప్2 పరీక్ష వాయిదా కోరినా కనీసం స్పందించలేదు. మళ్లీ గెలిస్తే, విద్యార్థిలోకానికి నష్టమే. అందుకే ఆయన ఓటమే లక్ష్యంగా పని చేసేందుకు చెన్నూరులో ప్రచారం చేస్తున్నాం. పోలీసులు మమ్మల్ని ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నిస్తే, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం.

– సురేశ్‌యాదవ్, ఓయూ జేఏసీ చైర్మన్

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- జైపూర్ ఏసీపీ మోహన్
- భీమారంలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



భీమారంలో ఫ్లాగ్‌మార్చ్‌లో ఏసీపీ మోహన్

భీమారం: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుని నిర్భయంగా వినియోగించుకోవాలని జైపూర్ ఏసీపీ మోహన్ ప్రజలను కోరారు. గురువారం మండల కేంద్రంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లరి మూకలు గొడవలకు దిగితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ రమేశ్‌బాబు, ఎస్సై రాజవర్ధన్, జైపూర్, చెన్నూరు పోలీసులు పాల్గొన్నారు

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

రామకృష్ణాపూర్: ప్రశాతం వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలంతా సహకరించాలని బెల్లంపల్లి ఏసీపీ సదయ్య కోరారు. పట్టణంలో గురువారం మందమర్రి సర్కిల్ పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, పట్టణ ఎస్సై రాజశేఖర్, పోలీసులు పాల్గొన్నారు.

అభ్యర్థుల గుర్తులు ఖరారు

మంచిర్యాలఅగ్రికల్చర్: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మంచిర్యాల నియోజకవర్గంలో బరిలో ఉన్న 17 మంది అభ్యర్థులకు రిటర్నింగ్ అధికారి రాములు గుర్తులు కేటాయించారు. గురువారం నాలుగు ప్రధాన పార్టీలతోపాటు 13 మంది స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు నిర్ణయించారు. జిల్లాలో మూడు నియోజకవర్గాలు ఉండగా మంచిర్యాలలో 17 మంది అభ్యర్థులు ఉండడంతో రెండు బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. ఒక ఈవీఎం బ్యాలెట్ యూనిట్‌లో 16 గుర్తులకే అవకాశం ఉంటుంది. ఇందులో 15 మంది అభ్యర్థులు, నోటాకు కేటాయిస్తారు. మంచిర్యాలలో 17 మంది అభ్యర్థులు పోటీలో ఉండడంతో రెండు బ్యాలెట్ యూనిట్లు వినియోగించాల్సి వస్తుంది. గతేడాది 21 మంది పోటీలో ఉండడంతో రెండు బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లోనూ రెండు బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటు చేయాల్సిన తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది.

మంచిర్యాల నియోజకవర్గంలో ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, గుర్తులు

అభ్యర్థి	పార్టీ	గుర్తు
కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు	కాంగ్రెస్	చేయి
తోట శ్రీనివాస్	బీఎస్పీ	ఏనుగు
నడిపెల్లి దివాకర్‌రావు	బీఆర్‌ఎస్	కారు
రఘునాథ్ వెరబెల్లి	బీజేపీ	కమలం
ఎడునూరి రమేష్	ధర్మసమాజ్‌పార్టీ	టార్చ్‌లైట్
గొర్లపల్లి సురేష్	విద్యార్థుల రాజకీయ పార్టీ	బ్యాట్
చెరుకూరి శాంతిశ్రీ	బహుజన రిపబ్లికేషన్ సోషలిస్ట్ పార్టీ	కుండ
దొమ్మటి రవికుమార్	ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ	సింహం
అందె మంగ	స్వతంత్ర	కత్తెర
యండీ.ఇష్తాకర్ అహ్మద్	స్వతంత్ర	వజ్రం
మొగిళి కృష్ణ	స్వతంత్ర	ఆపిల్
తళ్ళూరి వెంకటేశ్వర్లు	స్వతంత్ర	గ్యాస్ స్టౌవ్
సహీమ్ పాష యండీ	స్వతంత్ర	బీరువా
ప్రణయ్ గంగారెడ్డి	స్వతంత్ర	బాక్సు
రంగు మల్లేష్	స్వతంత్ర	గన్నా కిసాన్
సొల్ల సందీప్	స్వతంత్ర	రోడ్ రోలర్
హనుమాండ్ల శంకర్	స్వతంత్ర	గ్యాస్ సిలిండర్

ఎమ్మెల్యే చిన్నయ్యకు అస్వస్థత



చిన్నయ్యకు ఏరియా ఆసుపత్రిలో చికిత్స

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బెల్లంపల్లి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్య గురువారం అస్వస్థతకు గురయ్యారు. బీఆర్‌ఎస్ శ్రేణులు తెలిపిన వివరాలు ప్రకారం.. బెల్లంపల్లి మండలం చాకేపల్లి గ్రామంలో చిన్నయ్య ప్రచారం చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన పార్టీ శ్రేణులు కారులో బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యేను పరీక్షించిన వైద్యులు కంగారుపడాల్సిన అవసరం లేదని చెప్పడంతో కొద్దిసేపు సేద తీరారు. ఆ తర్వాత ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకుడు బిశ్వజిత్ దత్తా, పోలీసు శాఖ పరిశీలకుడు ఇలాంగ్ అభ్యర్థులతో నిర్వహించిన సమావేశానికి చిన్నయ్య హాజరయ్యారు. సమావేశం అనంతరం మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి అడ్మిట్ అయ్యారు. వైద్యులు 2డీఎకో, ఈసీజీ తీసి ఆందోళన అవసరం లేదని చెప్పినట్లు సమాచారం. గ్యాస్టిక్ సమస్య ఏర్పడడంతో అస్వస్థతకు గురైనట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. చిన్నయ్య అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు, బీఆర్‌ఎస్ శ్రేణులు ఆందోళన చెందారు. పలువురు నాయకులు చిన్నయ్యను ఆసుపత్రిలో కలిశారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి

నెన్నెల: గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణుల ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరిగేలా చూడాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. నెన్నెల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడుతూ గర్భిణులు కాన్పుకు నాలుగు రోజుల ముందు హెల్ప్‌డెస్క్‌లో పేరు నమోదు చేసుకుని ఆస్పత్రుల్లో చేరేలా చూడాలని తెలిపారు. గర్భిణులకు అవసరమైన అన్ని మందులు అందించాలని, చిన్నపిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని అన్నారు. ఆరోగ్య విషయాలు, వైద్యసేవలపై గర్భిణులు, ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. నిర్ణయించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని తెలిపారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పీహెచ్‌సీలోని సమస్యలపై డాక్టర్ లక్ష్మణ్‌ను అడిగి తెలుసుకున్నారు. డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ ఫయాజ్‌ఖాన్, సూపర్‌వైజర్ బసుమతి, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గోదావరిలో మునిగి ఒకరు మృతి



పంచనామా నిర్వహిస్తున్న పోలీసులు

కోటపల్లి(చెన్నూర్): ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని దేవులవాడకు చెందిన అట్టెల బక్కయ్య (50) గురువారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి ఎర్రాయిపేట సమీపంలోని గోదావరి నదిలో పుణ్యస్నానం ఆచరించేందుకు వెళ్లాడు. స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహానికి పంచనామా నిర్వహించారు. మృతుని భార్య బుజ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైలు కిందపడి గుర్తుతెలియని మహిళ ఆత్మహత్య

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్–రాళ్లపేట రైల్వే స్టేషన్ల మధ్య బుధవారం రాత్రి రైలు కిందపడి గుర్తుతెలియని మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. మృతురాలికి దాదాపు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని, ఆమె వద్ద ఉన్న సంచిలో దేవతామూర్తుల చిత్ర పటాలు ఉన్నట్లు తెలిపారు. రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. మృతదేహాన్ని సిర్పూర్(టి) సివిల్ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు. మృతురాలి వివరాలు తెలిసినవారు 8712658596, 83285 12176 నంబర్లకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

బైక్ కొనివ్వలేదని యువకుడు ఆత్మహత్య



సాయికుమార్(ఫైల్)

పెంచికల్‌పేట్: తల్లిదండ్రులు బైక్ కొనివ్వలేదని మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మొట్లగూడకు చెందిన పింగిరె సాయికుమార్ (21) పదోతరగతి పూర్తిచేసి ఇంటివద్దే ఉంటున్నాడు. కొద్ది రోజులుగా బైక్ కొనివ్వాలని తల్లిదండ్రులతో గొడవపడుతున్నాడు. వారు నిరాకరించడంతో మనస్తాపానికి గురయ్యాడు. గురువారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతిపై ఎస్సై కొమురయ్యను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

- జనం తరలింపునకు భారీగా డిమాండ్
- ఇదే అదనుగా రేట్లు పెంచుతున్న కిందిస్థాయి నేతలు
- అడిగినంత డబ్బుతోపాటు చుక్క, ముక్క ఉండాల్సిందే
- సభలు, ర్యాలీలు, ప్రచారానికి వచ్చే జనానికి ప్రత్యేక వంటకాలు
- జన సమీకరణకు నాయకుల ఆరాటం

అన్నా.. రేపు మన నియోజకవర్గంలో సభ.. ర్యాలీ ఉన్నాయి. మన ఊర్లో ప్రచారం ఉంది..పెద్ద నాయకులు వస్తున్నారు... జనం పెద్ద ఎత్తున కనబడాలే.. అంటూ ఎన్నికల్లో నిలిచిన అభ్యర్థులు పట్టణ, మండల, గ్రామ, వార్డు స్థాయి చోటామోట లీడర్లను ఆదేశిస్తున్నారు. అన్నా.. వెహికిల్స్, కూలి, మందు, విందు సౌకర్యం ఏర్పాటు చేయండి.. జనాన్ని సమీకరిస్తామని చెప్తున్నారు. సభల్లో, ర్యాలీల్లో జనం ఎక్కువగా కనిపించేందుకు నేతలు అడిగినంతా ఇచ్చుకుంటున్నారు. దీంతో కూలీలకు, చోటామోటా నాయకులకు ఉపాధి లభిస్తోంది.



ప్రచారానికి గిరాకీ!

జంగ్ తెలంగాణ

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల సమయం దగ్గర పడినకొద్దీ జిల్లాలో ప్రచారం జోరందుకుంది. ఒకవైపు నామినేషన్ల పర్వం ముగిసింది. మరో 14రోజుల సమయం మాత్రమే ఉంది. పోటీలో ఉంటున్న అభ్యర్థులు ప్రత్యర్థులకు జనబలం చూపించేందుకు ఖర్చుకు వెనుకాడడంలేదు. జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో నిర్వహించే సభలకు జాతీయ, రాష్ట్ర అగ్రనాయకులు వస్తుండడంతో జన సమీకరణ చేపట్టడానికి నాయకులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ప్రచారానికి, సభలకు వచ్చే జనాలకు నోటుతో పాటు చుక్క, ముక్క ఉంటేనే వస్తామని జనం తెగేసి చెప్తున్నారు. ఈక్రమంలో గార్డెన్లు, ఫంక్షన్‌హాళ్లు, హోటళ్లు కార్యకర్తలతో కిటకిటలాడుతున్నాయి. చికెన్ సెంటర్లు, మద్యం దుకాణాల్లో గిరాకీ పెరిగింది. వందల క్వింటాళ్ల చికెన్, మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. సభ నిర్వహించే ప్రాంతాల్లోని మద్యం దుకాణాలు జనాలతో కళకళలాడుతున్నాయి. గతంలో రోజుకు 50 నుంచి 60 కిలోల చికెన్ అమ్మె సెంటర్లు ఎన్నికల పుణ్యమా అని 4 నుంచి 5 క్వింటాళ్ల చికెన్ విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో చికెన్ ధరలకు డిమాండ్ పెరిగింది. గతంలో కిలోకు రూ.200 నుంచి 220 వరకు ప్రస్తుతం రూ.270 నుంచి రూ.300వరకు చేరుకుంది. మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలకు అమ్ముతున్నా కోరిన బ్రాండ్లు కొన్నిచోట్ల లభించడం లేదు. చాటుమాటున అమ్ముతున్న బెల్ట్ దుకాణాల్లో క్వాటర్ బాటిల్ ఎమ్మార్పీపై రూ.30 నుంచి రూ 40, బీరు రూ.50 నుంచి రూ.60 వరకు అదనంగా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఉపాధి ఇలా..

ఆసిఫాబాద్‌అర్బన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర, దేశ నాయకుల వేషధారణలు, డప్పు చప్పుళ్ల నుంచి డీజే వరకు, కోలాటం నుంచి బతుకమ్మ వరకు ప్రతి ఒక్కరికీ చేతినిండా పని దొరుకుతోంది. వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఏగ్రామంలో పర్యటించాలని భావించినా డప్పు చప్పుళ్లు, కోలాటం, కళాకారుల నృత్యాలు, ఇతర కార్యక్రమాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ ఏర్పాట్లు లేనిదే ప్రచారంలో జోష్ కన్పించడం లేదు. మగవారికి రూ.500, మహిళలకు రూ.300 చొప్పున చెల్లిస్తూ ప్రచారానికి వాడుకుంటున్నారు. కూలీలకు రోజువారీ కూలితో పాటు భోజన ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. దీంతో నాయకులకు ప్రచారం.. కూలీలకు ఉపాధి లభిస్తోంది.

మాంసాహార భోజనమే..

గతంలో ఎన్నడూ లేనివిధంగా సభలకు బైక్‌పై వచ్చేవారు పెట్రోల్, భోజనం, మందు, రూ.400 నుంచి రూ.500 వరకు కూలి చెల్లిస్తేనే వస్తామని డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా యువత మాంసాహార భోజనం పెట్టాలని హుకుం జారీ చేస్తున్నారు. నిన్న గాపార్టీ సభకు వెళ్తే చికెన్‌తో భోజనం, మందు, రూ.300 ఇచ్చింద్రు. ఇవ్వాల సభకు రావాలంటే నాలుగు వందలు, చికెన్, మటన్, మందు ఏర్పాటు చేస్తేనే వస్తామని చెప్పుండడంతో లీడర్లు బిత్తరపోతుంద్రు.

మద్యం దుకాణాలకు టోకెన్లు

ఎన్నికల నియమావళిలో భాగంగా ఆయా నియోజకవర్గాల పరిధిలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటికల్, పోలీసు సిబ్బంది తనిఖీలు చేపడుతున్నారు. చెక్ పోస్టులతో పాటు ఆకస్మిక తనిఖీల్లో నగదు, మద్యం, ఇతరత్రా మత్తు పదార్థాలు, బహుమతులు తరలించకుండా, ఓటర్లను ప్రభావితం చేయకుండా నియంత్రిస్తున్నారు. దీంతో సభలు, ర్యాలీలకు వచ్చే జనాలకు నగదు చెల్లించేందుకు, మద్యం సరఫరా చేసేందుకు ఇబ్బంది కలుగుతుండడంతో నాయకులు కొత్తపంథా ఎంచుకుంటున్నారు. ఆయా మద్యం దుకాణాలతో ఒప్పందాలు చేసుకుని టోకెన్లు జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. నగదు సరఫరాకు కిందిస్థాయి లీడర్లు ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా చెల్లింపులు చేస్తున్నట్లు తెలుస్తోంది.

నాడు నలుగురితో.. నేడు బలగంతో..

- మారిన ఎన్నికల ప్రచారం తీరు

దండేపల్లి(మంచిర్యాల): ఎన్నికల ప్రచారం తీరు మారింది. సుమారు రెండు దశాబ్దాల క్రితం ప్రతీ గ్రామంలో నలుగురితో మాట్లాడి, ఎన్నికల తేదీలు చెప్పి ప్రచార కరపత్రాలు అందించి వెళ్లిన అభ్యర్థులు నేడు అన్ని గ్రామాల్లో పార్టీల నాయకులు, కార్యకర్తల బలగంతో వెళ్లి ప్రచారం నిర్వహిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. గతంలో ప్రతీ గ్రామంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు కులాల వారీగా పెద్దలతో సమావేశమయ్యేవారు. బ్యాండు మేళాలు, డీజేలు లేకుండా కేవలం తమ వాహనాల్లో వచ్చి తమకు అనుకూలంగా ఉన్న పెద్దలు, వారి అనుచరులతో మాట్లాడి వెళ్లేవారు. లేదంటే గ్రామంలోని ఓ కూడలి వద్ద చిన్నపాటి సమావేశం నిర్వహించి ఎన్నికల ప్రచారం చేసేవారు. ప్రస్తుతం ఎన్నికల ప్రచారం తీరు మారింది. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ప్రతీ గ్రామానికి నాలుగైదుసార్లు పార్టీల నాయకులు, కార్యకర్తలతో వెళ్లి ఇంటింటా తిరిగి ప్రచారం చేస్తున్నారు. పది ఓట్లు ఉన్న కుటుంబం వద్దకు కూడా అభ్యర్థులు వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించడం గమనార్హం. వాడవాడలా, గడప గడపకూ బ్యాండు మేళాలతో వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఏది ఏమైనా ప్రచారంలో నాటికి, నేటికి అనేక మార్పులు వచ్చాయనే చెప్పవచ్చు.

వైఎస్సార్‌టీపీకి 'సిరికొండ' రాజీనామా

జన్నారం(ఖానాపూర్): వైఎస్సార్‌టీపీ నిర్మల్ జిల్లా అధ్యక్షురాలు సిరికొండ లక్ష్మి పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌టీపీ పోటీ చేయకపోవడం వల్ల పార్టీ మనుగడకు నష్టం వాటిల్లుతోందన్నారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేయడానికి ఆర్థికంగా నష్టపోయామన్నారు. రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు పంపినట్లు తెలిపారు. త్వరలో బీఆర్‌ఎస్‌లో చేరనున్నట్లు ఆమె ప్రకటించారు.

విద్యార్థులకు ఉపన్యాస పోటీలు



విజేతలతో సెక్టోరియల్ అధికారులు

మంచిర్యాలఅర్బన్: జాతీయ ప్రకృతి వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సైన్స్ సెంటర్‌లో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ విజ్ఞాన్ ప్రతిష్ఠ సంస్థ, తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో గురువారం పాఠశాల విద్యార్థులకు 'మానవ జీవన విధానంలో ప్రకృతి పాత్ర'పై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. సబ్బెపల్లి జెడ్పీఎస్ఎస్ విద్యార్థి లోహిత ప్రథమ బహుమతి, మంచిర్యాల బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి శ్రీజ ద్వితీయ బహుమతి, గర్మిళ్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థి అఖిల తృతీయ బహుమతి సాధించారు. విజేతలకు సెక్టోరియల్ అధికారులు చౌదరి, శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, ఎంఈవో జాడీ పోచయ్య చేతుల మీదుగా నగదు పురస్కారం, మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో సోషల్ స్టడీస్ ఫోరం జిల్లా అధ్యక్షుడు నరేందర్ రావు, ప్రధాన కార్యదర్శి మహేష్, సభ్యులు బండి రమేశ్, రమేశ్ కుమార్, లక్ష్మీనారాయణ, నరసింహులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్–14 బాలుర విభాగంలో ప్రశాంత్, స్టీవెన్‌పాల్, అండర్–17 విభాగంలో కార్తీక్, బన్నీ ఎంపికయ్యారు. ఇటీవల అస్నాద్‌లో జరిగిన అండర్–14 వాలీబాల్ పోటీల్లో ఈశ్వరప్రసాద్ ఎంపికయ్యారు. విద్యార్థులను హెచ్ఎం దుర్గయ్య, పీడీ రాజయ్య, విద్యాకమిటీ సభ్యులు అభినందించారు.

పోటీలకు తరలిన విద్యార్థులు

గద్వాలలో ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చెందిన విద్యార్థులు గురువారం తరలివెళ్లారు. డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పరిమిళ, పీడీ రేణిరాజయ్య విద్యార్థులకు జెర్సీ(క్రీడా దుస్తులు)లను అందజేశారు.

జాతీయస్థాయి పోటీలకు 'ముత్యంపల్లి' విద్యార్థులు



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

కాసిపేట(బెల్లంపల్లి): హైదరాబాద్‌లోని సీసీఆర్‌లో ఈనెల 15న నిర్వహించిన కళోత్సవ్ పోటీల్లో మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు పాల్గొని జాతీయస్థాయికి ఎంపికైనట్లు గైడ్ టీచర్ బండ శాంకరీ తెలిపారు. టాయ్స్ అండ్ గేమ్స్‌లో బాలుర విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థి జి.నరేందర్ కొబ్బరిపీచు, చెక్కపొట్టు, వెదురుతో బొమ్మలు తయారు చేయడం, బాలికల విభాగంలో బింధుప్రియ తోలుబొమ్మలు ప్రదర్శించి ప్రథమ స్థానంలో నిలిచారు. జేడీ రాజీవ్ చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

'ప్రచార' లెక్కలపై తప్పులమీద తప్పులు

- రూ.10 వేలను రూ.15 వేలుగా దిద్దిన అధికారులు
- వివరాల సేకరణలో రిటర్నింగ్ అధికారి

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎన్నికల ప్రచార లెక్కల్లో మున్సిపల్ అధికారులు తప్పుల మీద తప్పులు చేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ప్రచార అనుమతి కోసం చెల్లించిన డబ్బుల లెక్కలను గోల్‌మాల్ చేసి అడ్డంగా దొరికిపోయిన వైనాన్ని గురువారం 'ప్రచార అనుమతి లెక్కల్లో తేడాలు' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో ఉలిక్కిపడ్డ మున్సిపల్ అధికారులు వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య ప్రచార అనుమతి కోసం రూ.15 వేలు చెల్లించగా మున్సిపల్ రశీదు, అంతర్గత రిజిష్టర్‌లో రూ.10 వేలుగా నమోదు చేసి మున్సిపల్ కమిషనర్ సంతకం చేసిన విషయం తెలిసిందే. రశీదుపై రూ.10 వేలుగా దిద్దిన అంకెలను మరోసారి దిద్ది రూ.15 వేలుగా మార్చడం అధికారులకే చెల్లింది.

పార్టీకో లెక్క(నా) ...!

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 8న ముఖ్యమంత్రి కేసీఆర్ బెల్లంపల్లికి వచ్చారు. సీఎం రాకను పురస్కరించుకుని పట్టణంలో భారీగా స్వాగత తోరణాలు, కటౌట్లు, హోర్డింగులు ఏర్పాటు చేశారు. 11న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి కూడా బెల్లంపల్లికి రాగా స్వాగతం పలుకుతూ పెద్ద ఎత్తున ప్రచార ఏర్పాట్లు జరిగాయి. రెండు పార్టీలు పోటాపోటీగా జెండాలు, తోరణాలు, కటౌట్లు కట్టాయి. ఓ పార్టీ నుంచి రూ.9 వేలు, మరోపార్టీ నుంచి రూ.15 వేలు వసూలు చేసి తేడాగా వ్యవహరించినట్లుగా చర్చించుకుంటున్నారు.

దృష్టి సారించిన ఆర్వో ...

అనుమతి మంజూరు రుసుం వసూలులో జరిగిన అవకతవకలపై బెల్లంపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ దృష్టి సారించినట్లు తెలిసింది. సాక్షిలో వచ్చిన కథనాన్ని కొందరు వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేయగా మరికొందరు ఆర్వో రాహుల్ మొబైల్‌కు వాట్సాప్ చేశారు. దీంతో స్పందించిన రిటర్నింగ్ అధికారి కిందిస్థాయి అధికారులను పురమాయించి ఆధారాలు సేకరించినట్లు సమాచారం. ప్రచార అనుమతి లెక్కల్లో తేడా వచ్చిన వ్యవహారాన్ని సాక్షి బెల్లంపల్లి రిటర్నింగ్ అధికారి రాహుల్ దృష్టికి తీసుకెళ్లగా వివరాలు కనుక్కుంటానని తెలిపారు.

ఆర్టీసీ పెట్రోల్ బంక్ ప్రారంభం



బంకును ప్రారంభిస్తున్న ఆర్టీసీ డీఎం

చెన్నూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకును డీఎం రవీంద్రనాథ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ బస్టాండ్ ప్రాంగణాల్లో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. తద్వారా సంస్థకు ఆదాయం సమకూరుతుందన్నారు. కార్యక్రమంలో కంట్రోలర్ శేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా, మద్యం పట్టివేత



బెల్లం పానకం ధ్వంసం చేస్తున్న ఎస్సై

కౌటాల: మండలంలోని బాలేపల్లిలో గురువారం దాడులు నిర్వహించి 15 లీటర్ల నాటుసారా, 20 మద్యం సీసాలు పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. మద్యం విక్రయిస్తున్న దుర్గం నాందేవ్‌పై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

6 వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

బెజ్జూర్: మండలంలోని తలాయి, తిక్కపల్లి గ్రామాల మధ్య ప్రాణహిత నది ఒడ్డున గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన 6 వేల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సీఓఈ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఐనాల సైదులు

బెల్లంపల్లి: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఇటీవల పట్టణంలో నిర్వహించిన జోనల్‌స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో బెల్లంపల్లి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల సీవోఈ విద్యార్థులు పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అండర్–14 విభాగంలో ఐనాల భగవత్ (ఏడో తరగతి), చందా అక్షిత్ (తొమ్మిదో తరగతి) విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. నేటి నుంచి మహబూబ్ నగర్ జిల్లా గద్వాలలో జరుగనున్న పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు తరఫున ఆడనున్నారు. గురువారం ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, పీఈటీ వామన్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

రైల్వే గేటు.. ప్రాణాలకు చేటు..



రైల్వే గేటు పడడంతో నిలిచి ఉన్న వాహనదారులు



అసంపూర్తిగా ఉన్న ఆర్‌వోబీ

- ఇటీవల ఇద్దరు యువకుల దుర్మరణం
- నాలుగేళ్ల క్రితం పాముకాటు బాధితుడు మృతి
- పదేళ్లుగా నత్తనడకన క్యాతనపల్లి ఆర్‌వోబీ నిర్మాణ పనులు
- ఫ్లైఓవర్ పూర్తికాకపోవడమే ఇందుకు కారణం..

రామకృష్ణాపూర్(చెన్నూర్): రామకృష్ణాపూర్‌లోని రైల్వేగేట్ ప్రాణాంతకంగా మారింది. బుధవారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన ఘటనే ఇందుకు నిదర్శనం. క్యాతనపల్లి వద్ద రైల్వే గేటు వేసి ఉండగా ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంతో గేటు దాటేందుకు ప్రయత్నం చేశారు. ఒక్కసారిగా వచ్చిన ఎక్స్‌ప్రెస్ రైలు వేగంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. నాలుగేళ్ల క్రితం ఇదే రైల్వేగేటు మరొకరిని కూడా పొట్టన పెట్టుకుంది. పాముకాటుకు గురైన సమీర్‌ను మండల్ మంచిర్యాల ఆస్పత్రికి తీసుకెళ్తుండగా క్యాతనపల్లి వద్ద గేటుపడింది. సమయానికి చికిత్స అందక సమీర్ మండల్ ప్రాణాలు విడిచాడు. వీటన్నింటికీ నత్తనడకన సాగుతున్న రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణమే ప్రధాన కారణంగా ప్రజలు ఆరోపిస్తున్నారు. పదేళ్ల క్రితం చేపట్టిన బ్రిడ్జి నిర్మాణం ఇంకా పూర్తికాకపోవడం వెనుక విభిన్నమైన విమర్శలు వినవస్తున్నాయి. ఆసిఫాబాద్ నుంచి ఇందారం రాజీవ్ రహదారి వరకు నాలుగు వరుసల జాతీయ రహదారి రెండేళ్లలోనే బ్రిడ్జీలతో సహా పూర్తి కావస్తుంటే క్యాతనపల్లి ఫ్లైఓవర్ కథేమిటో అంతుపట్టడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిర్లక్ష్యం ఎవరిది?

క్యాతనపల్లి రైల్వే ఫ్లైఓవర్‌బ్రిడ్జి నిర్మాణ పనుల్లో అడ్డగోలు నిర్లక్ష్యం సాగుతోంది. బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి సంబంధిత శాఖల అధికారులు నోరు మెదపడంలేదు. పదేళ్ల క్రితం మంజూరైన బ్రిడ్జి నిర్మాణ పనులు నేటికీ సాగుతుండటమే అధికార యంత్రాంగం వైఫల్యాన్ని కొట్టొచ్చినట్లు చూపెడుతోందని ప్రజలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. ఇది నిర్లక్ష్యమా లేక మరే ఇతర కారణాలు ఉన్నాయా అనే అనుమానాలకు దారితీస్తోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేలా కృషి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల హోరు.. బెట్టింగ్‌ల జోరు..

మంచిర్యాలక్రైం: ఇదివరకు బెట్టింగ్ అంటే ఐపీఎల్, క్రికెట్ బెట్టింగ్‌లు పెట్టుకోవడం మాత్రమే విన్నాం. కానీ ప్రస్తుతం జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల గెలుపు ఓటములపై బెట్టింగ్ కాస్తున్నట్లు సమాచారం. మంచిర్యాల నియోజకవర్గంలో రెండు ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు ఓటములపై కొందరు రూ.లక్షల్లో బెట్టింగ్ కాస్తున్నట్లు సమాచారం. మంచిర్యాలకు చెందిన కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, వాణిజ్య వ్యాపారులు, రూ.10 వేలకు రూ 20వేలు ఇలా మొదలుకొని రూ.లక్షల్లో బెట్టింగ్ కాస్తున్నట్లు తెలిసింది. కోల్‌బెల్ట్ ప్రాంతానికి చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి జాతీయ పార్టీకి చెందిన అభ్యర్థి గెలుపు ఖాయమని రూ.లక్షకు... లక్ష ఇచ్చే విధంగా బెట్టింగ్ కాసినట్లు సమాచారం. కొందరు రియల్ ఎస్టేట్, వర్తక వ్యాపారులు, సామాన్య ప్రజలు సైతం ఓ ప్రధాన జాతీయ పార్టీకి చెందిన అభ్యర్థి గెలుస్తాడంటూ బెట్టింగ్ కాయడం చర్చనీయాంశమైంది.

తనిఖీలు ముమ్మరం

- సమీపిస్తున్న ఎన్నికలు
- నగదు, మద్యం, బహుమతుల రవాణాపై దృష్టి



రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ పోలీసులు రోజురోజుకూ దూకుడు పెంచుతున్నారు. జిల్లాలో ఎక్కడ పడితే అక్కడ తనిఖీలు, సోదాలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు ఇంకా 13 రోజుల గడువు మాత్రమే ఉండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. డబ్బు, మద్యం, ఇతర బహుమతుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు తనిఖీలు ముమ్మరం చేశారు. రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి, భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం ఏసీపీ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్, బస్టాండ్, లాడ్జీలలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. వారం రోజుల నుంచి లాడ్జీలకు వచ్చిపోయిన వారి వివరాలు, ఇన్‌వార్డ్, అవుట్ వార్డ్ రికార్డులు, సీసీ ఫుటేజీలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏసీపీతో పాటు సీఐ రాజు, ఎస్సైలు రాజేందర్, జగదీశ్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రచార రథం ధ్వంసం

ఆసిఫాబాద్‌రూరల్: బీజేపీ ప్రచార రథాన్ని గుండి గ్రామస్తులు ధ్వంసం చేశారు. గుండి గ్రామానికి వంతెన నిర్మాణం పూర్తి కాకపోవడంతో గ్రామస్తులు అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించారు. వంతెన పూర్తి చేసే వరకు ఓటు వేయమని ఫ్లెక్సీలు పెట్టిన విషయం తెలిసిందే. గురువారం గ్రామానికి వచ్చిన బీజేపీ ప్రచార రథాన్ని ఆపి ధ్వంసం చేశారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అజ్మీరా ఆత్మారాం నాయక్ సంఘటన స్థలానికి వచ్చి కక్షపూరితంగానే కొంతమంది బీఆర్‌ఎస్ నాయకులు రథాన్ని ధ్వంసం చేశారని, వారిపై కేసు నమోదు చేయాలని రోడ్డు పై బైఠాయించి డిమాండ్ చేశారు. ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెంకటరమణ చెప్పడంతో ఆందోళన విరమించారు.